# దేశ సమగ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ఒడిశా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఐ.రాంబ్రహ్మం



కార్యక్రమంలో పాల్గొన్న ఒడిశా విశ్వవిద్యాలయం సిబ్బంది

**కొరాపుట్:** దేశ సమగ్రత, ఐక్యతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొరాపుట్ ఒడిశా విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఐ.రాంబ్రహ్మం కోరారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని, విశ్వవిద్యాలయం సునాబెడ క్యాంపస్‌లో 'రాష్ట్రీయ ఏక్తా దివస్' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన తొలుత వల్లాభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం దేశాభివృద్ధిలో సర్దార్ కృషిని కొనియాడారు. ఆయన కృషి ఫలితంగానే అఖండ భారతావని ఆవిర్భవించిందని, ఈ నేపథ్యంలో భారతీయులంతా ఏకతాటిపై నడిచి జాతి, మత, భాష, ప్రాంతీయ భేదాలు లేకుండా దేశ పురోగతికి పాటుపడాలన్నారు. అలాగే అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచి దేశ ఖ్యాతిని ప్రపంచ నలుమూలలకు విస్తరించాలన్నారు. ముఖ్యంగా దేశ భద్రతకు నిత్యం పాటుపడుతున్న భద్రతా దళాలు, పోలీస్ యంత్రాంగానికి మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అసిత్‌కుమార్ దాస్ మాట్లాడుతూ దేశ ఐక్యత కోసం సర్దార్ పటేల్ 565 సంస్థానాలను దేశంలో విలీనం చేసేందుకు కృషి చేశారని అన్నారు. అనంతరం దేశ ఐక్యతకు కట్టుబడి ఉంటామని విశ్వవిద్యాలయం సిబ్బంది శపథం చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం డీన్ శరత్ కుమార్ పలిత, ప్రొఫెసర్లు పి.దుర్గాప్రసాద్, పీఆర్‌ఓ డాక్టర్ ఫగునాత్ భొయి, సుధాకర్ పట్నాయక్, పద్మలోచన స్వంయి తదితరులు పాల్గొన్నారు.

**భువనేశ్వర్:** సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని, తూర్పుకోస్తా రైల్వే, కటక్-భువనేశ్వర్ జంట నగరాల పోలీస్ కమిషనరేటు, భారతీయ సాంకేతిక సంస్థ(ఐటీఐ) కార్యాలయాల్లో రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతి ఐక్యత, సమగ్రత పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రజానీకాన్ని చైతన్య పరుస్తామని కార్యక్రమంలో పాల్గొన్న వారంతా శపథం చేశారు. తొలుత వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించిన అధికారులు దేశాభివృద్ధిలో ఆయన కృషిని కొనియాడారు. అందరూ పటేల్ అడుగుజాడలో నడిచి, దేశ ఐక్యతను ప్రపంచానికి చాటాలన్నారు.

**రాయగడలో..**

**రాయగడ:** జిల్లాలోని గుణుపూర్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్‌డీపీఓ రాజ్‌కిశోర్ దాస్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం పటేల్ దేశ సమగ్రత, సమైక్యత కోసం చేసిన కృషిని కొనియాడారు. అలాగే ఆయన అడుగుజాడల్లో యువత నడిచి, దేశమంతా ఒక్కటిగా ఉండేందుకు పాటుపడాలని హితవు పలికారు. ముఖ్యంగా జాతి, మత, కుల భేదాలు లేకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా దేశ సమైక్యత కోసం తమ వంతు కృషి చేస్తామని పోలీసులు ప్రమాణం చేశారు.



భువనేశ్వర్: దేశ ఐక్యతకు కట్టుబడి ఉంటామని శపథం చేస్తున్న ఐఐటీ అధికారులు



భువనేశ్వర్: పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



రాయగడ: కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు